# 'రూం నెంబర్ త్రీ'

ప్రశాంత్ నర్సింగ్ హోం రూం నంబరు 'త్రి' ఈ మధ్య వో కొత్త బిరుదునూ కీర్తినీ సంతరించుకున్నది. అది యిప్పుడు 'హాంటెడ్ రూం' దయ్యాల గది, ప్రేతాత్మలకు ఆటపట్టు వగైరా వగైరా ఖితాబులు ఎన్నో ఎన్నెన్నో.

ఇంతకాలం ఆ గది అందరికీ వలపుకత్తె, ఇప్పుడది వొల్లని నల్లపిల్ల, చెల్లని రూపాయి. ఇప్పుడా నర్సింగ్ హోంలో పనిచేసే వారు కూడా రాత్రిళ్లు ఆ గది దరిదాపులకు రావటానికే భయపడ్తున్నారు. ఇక పేషంట్ల విషయం చెప్పడానికే వీలులేదు. తెలియక ఏ పేషెంటైనా వచ్చి చేరినా ఆ మర్నాటికే గది ఖాళీ చేసి వేరే గదికి మారుతున్నారు.

ఆ నోటా ఈ నోటా ఆ గదికీర్తో? అపకీర్తో? చెప్పలేం కానీ పొగలా వ్యాపించి పోయింది. అందులో కాపురం వుంటున్న దయ్యం చేసే వింత వింత పనులను కతలల్లి, దండలుగా కుచ్చుతూ వో చరిత్ర సృష్టించారు. అక్కడ వుండే విచిత్ర వ్యక్తులు.

ఈ మూడో నంబరు గది తూర్పు ముఖంగా, రెండు వైపులా కిటికీలతో పొందికగా అందంగా మొదటి అంతస్థుపై వుంటుంది. ఈ గదిలో కిటికీలు తెర్చుకుంటే వొంటరిగా వున్నాం అనే ఫీలింగే రాదు; ఎండాకాలం సయితం ఎదరుగా వున్న పెద్ద చెరువు నీటిపైనుండి వీచే చల్లని గాలి శరీరానికి హాయిని ఇస్తుంది. రాత్రిపూట ఆ చెరువు కట్టపై వెలిగే నీలి దీపపు కాంతి ప్రసారం ఈ కిటికీ నుండి గదిలో ప్రవేశిస్తూ గదిలో వున్న వారి కళ్లకు వెన్నెల వెలుగులా చల్లటి అనుభూతినీ సుఖాన్నీ పంచుతుంది. ఇట్లా అందరికీ కన్నాకైన రూం నెంబరు త్రీ ఇప్పుడు ఎవ్వరికీ పనికి రానిదిగా మారింది.

అయినా అప్పటికీ ఇప్పటికీ రూం నెంబరు త్రి అంటేనే త్రిల్.

ఎవ్వరికీ తెలియకండా అప్పుడప్పుడు ఖాళీ సమయాల్లో డ్యూటీ డాక్టర్లు సిస్టర్లు వాడుకుంటూ వుండే వారు. ఇప్పుడిప్పుడే కొత్తగా వో ప్రేమజంటకు ఈ మూడో గది

మీటింగ్ ప్లేస్‌గా మారింది. ఈ రహస్యాన్ని ఆ జంట ఎంతో భద్రంగా కాపాడుకుంటూ వచ్చారు.

ఈ సందర్భంలోనే డా॥ వేణుగోపాల్ న్యూరోసర్జన్‌గా కొత్తగా వచ్చి చేరాడు. ఆయన సైకాలజిలో నిపుణుడు, చిన్నవాడైనా తన పనిలో దిట్ట. నిర్భీకుడు. ఆ డాక్టరు మూడో నంబరు గదికి ఎవ్వరూ వెళ్లకపోవడానికి కారణాలను గూర్చి ప్రశ్నించినప్పుడు, వార్డ్‌బాయ్‌నుండి, డ్యూటీ డాక్టరు వరకు ఒకే కథను పలువలు చిలువలతో అలంకరిస్తూ చెప్పారు. ఆ కథ ఇలా సాగింది.

గంగారాం చాలా కాలంగా రక్తపోటుతో బాధపడుతున్నాడు. మనిషి ఏవంత ముసలివాడేం కాదు. అయినా ఆయన చేస్తున్న వ్యాపారం అలాంటి వొత్తిడికి గురిచేస్తుంది. ఆయన నగరంలో పేరైన వెండీ బంగారు నగల వ్యాపారి. కొడుకులూ కోడళ్లూ భార్యాబలగం అంతా వున్నారు.

వున్నట్లుండి బంగారం ధర బాగా పడిపోయింది. బోంబాయి షేర్ మార్కెట్లో కూడా షేర్ల ధరలు పడిపోయినట్లు రేడియోలో వార్త వచ్చింది. ఆ వార్త వింటు వింటూనే 'హా' అంటూ గంగారాం పడిపోయాడు స్పృహతప్పి. అదీ చూచి అందరూ 'అయ్యో! అమ్మో! అంటూ నెత్తినోరు కొట్టుకుంటూ బిలబిలమంటూ వచ్చి చుట్టూ చేరారు.

పరిస్థితి గ్రహించి గంగారాం ను వెంటనే వో ప్రైవేటు నర్సింగ్ హోంలో చేర్పించారు. నాల్గు చేతులా సంపాదించే వ్యక్తి పోతే ఎలా? అందుకే గంగారాం జీవించాలి.

నర్సింగ్‌హోంలో చేరిన వో నాల్గు గంటల తరువాత గంగారాంకు స్పృహ వచ్చి మెల్లమెల్లగా కళ్లు తెరిచి చూచాడు. అందరి ముఖాల్లో సంతోషం కనిపించింది. ఆ ఈ విశాషాలేవి అడిగిపట్టించుకోకుండా 'నా తాళపు చెవులూ' అంటూ నడుము సర్దుకున్నాడు, అన్నీ భద్రంగానే వున్నాయి.

పెద్దకొడుకు రాగానే దగ్గరగా పిలిచి గుసగుసమంటూ, ఏవేవో రహస్యాలు చెప్పాడు. పాపం కొడుకు రాంలఖన్ అవన్నీ ఇప్పుడెందుకు నాన్నా! అంటూనే ఆ రహస్యాలు ఎవ్వరికీ తెలియకండా జాగ్రత్త పడ్డాడు.

వంతుల వారీగా డాక్టర్లు వచ్చి తోచిన మందులూ సలహాలు, జరిపించవలసిన పరీక్షల వివరాలు రాసి వెళ్లుతున్నారు. చివరికి చేయవలసిన టెస్ట్ లిస్ట్ విపరీతంగా పెరిగిపోయింది. అంటే గంగారాం శరీరంలోని ప్రతి అవయవమే కాకుండా రక్తం, మజ్జా, మెదడు, కండరాలు, నరాలు అన్నీ టెస్టింగ్ మెషీన్‌లోకి పంపి కంప్యూటర్ ద్వారా సరిచూచిన రిపోర్టులు కావాల్సి వచ్చింది.

ఆ పరంపరలో మొదటిదిగా వో, నర్స్ లావుపాటి సిరెంజ్‌తో వచ్చి 'సర్ ! రక్తం పరీక్షకు పంపేందుకు రక్తం తీసుకోవాలి, మీ చెయ్యి యిలా వుంచండి. అంటూ ముందుకు సాగింది ఆమె సిస్టర్ షీనీ. చెయ్యి ఇవ్వక తప్ప లేదు గంగారాంకు.

ఇంతకాలం కాజూ బాదాం పిస్తాలతో ప్రోది చేసిన తన రక్తాన్ని పెద్ద సిరెంజి నిండా లాగుతూ వుంటే 'అమ్మయ్యో! ఇంత నెత్తురా? మళ్లా ఎన్ని మేవాలు, ఎన్ని పళ్లూ, అవి తిని ఇంత ఎర్రటి రక్తం సంపాదించాలి ? ఎంతఖర్చు? అంటూ గిలగిలలాడింది గంగారాం మనస్సు, కానీ తనను లాలనగా మాటలతో ఏ మార్చి ఏ మాత్రం నొప్పి తెలియనీకండా రక్తాన్ని చేదుకుంటున్న షీనీ చాకచక్యం, తన రక్తానికే రంగులు దిద్దే ఆమె ఎర్రటి లేత పెదవుల విలాసం గంగారాంను మైమరిపింప చేసింది. సాముదాయకంగా ఆకర్షణీయమైన షీనీ ప్రవర్తనా రామణీయకాన్ని చూస్తూ తన ప్రాణాలకన్న మిన్నగా భావించే డబ్బు మీది లోభాన్ని మరచి చాలా ధైర్యవంతుడిలా బ్రిలియంట్ ఫేస్ పెట్టాడు. షీని తన పని ముగించుకుని వో చిన్న నవ్వు చిరుకానుకగా పారేసి వెళ్లింది.

తెల్లవారి రిపోర్టులు అన్నీ వచ్చాయి. హై బి.పి.తో పాటు బ్లడ్ షుగర్ కూడా వుంది, హార్ట్‌లో బ్లడ్ వేన్స్ అరవై డెబ్బై శాతం వరకు మూసుకుపోయాయి. వెంటనే 'అంజియోగ్రాం' చేయాలి లేకపోతే ప్రమాదం అన్నారు. కొడుకు సరే అన్నాడు.

ఆ మాట విన్న గంగారాం మళ్లా మూర్ఛలోకి పోయేవాడే కాని సిస్టర్ షీని ఆరోగ్య దేవతలా వచ్చి ఆ ప్రమాదం నుండి కాపాడింది. షీనీకి సహజమైన చాతుర్యంతో నవ్వే కళ్లతో పలుకరిస్తూ 'హలో! హే! గంగారాం వాట్ న్యూస్? యూ ఆర్ ఏ బోల్డ్‌బాయ్, కమాన్ నో కిడింగ్, ఈ రోజుల్లో అందరికీ సర్వసాధారణంగా జరిగే చికిత్స ఇది, మూడు రోజుల్లో హేల్ యాండ్ హెల్దీ గంగారాం ఐ పోతారు. గెట్ రెడీ వి ఆర్ గోయింగ్' అంటూ వుత్సాహ పరిచింది. లాలానగా భుజం తట్టింది.

షీనీ స్పర్శ గంగారాంలో నవచైతన్యాన్ని ప్రోది చేసింది. కొండంత ధైర్యాన్ని ఇచ్చింది. ఇచ్ఛాశక్తిని పెంచింది. గంగారాం తన బాధలనూ పిరికితనాన్నీ మరుస్తూ సాహసించి షీనీ చేతిని తన చేతిలోకి తీసుకుంటూ

'సిస్టర్! మీరు చెబితే సర్జరీకే కాదు నరకానికి కూడా పోవటానికి సిద్ధంగా వున్నాను' అన్నాడు గంగారం.

షీనీ ప్రసన్నంగా నవ్వుతూ, 'అంత పని చెయ్యొద్దు కానీ, ఇప్పటికి మట్టుకు ఈ అంజియోగ్రాం చేయించుకోటానికి వొప్పుకోండి చాలు' అన్నది.

ఏకవచన ప్రయోగం చేస్తూ 'సిస్టర్! నీవూ నాతోనే వుంటావు కదూ? అన్నాడు గంగారాం, 'తప్పకుండా' అంటూ మాట ఇచ్చింది షీని.

ఆపరేషన్ జరిగింది. ఏ కాంప్లికేషన్లూ రాలేదు. అంతా సంతోషించారు. రూం నెంబరు ఐదులో ప్రత్యేకమైన సాంకేతిక సదుపాయాలేవో వున్నందున మూడవ గది మార్చి ఈ గదికి గంగారాంను తరలించవలసి వచ్చింది. ఇప్పుడు తన సేవలో వున్నది షీనీ కాదు సిస్టర్ శీల. ఈ మార్పును గంగారాం ఏ మాత్రం ఇష్టపడలేదు. మూడో నంబరు గది తప్ప

మరే గదిలో వుండలేనంటూ పట్టుబట్టాడు. ఏదో కష్టపడితే ఈ గదిలోని ఎక్విప్‌మెంటును తిరిగి ఆ గదిలోకి మార్చవచ్చు కానీ ఆ మూడో గదిలో మరో హార్ట్ పేషెంటు వచ్చి చేరాడు. మరి ఆ పేషెంట్‌ను కారణం లేకుండా కదపడానికి వీలులేదు. మరి ఎలా? గంగారాం నోపిక పట్టాలి అన్నారు. గంగారాం చాల అసంతృప్తిగా ఇంపేషెంటుగా వున్నాడు. ఏ విషయంలో కో ఆపరేట్ చేయడం లేదు.

ఉన్నట్లుండి రూం నెంబరు మూడులో పేషెంట్ పెద్దకేకలు పెట్టాడు. ఆ కేకలు విన్న డ్యూటీ డాక్టరూ, నర్సూ అంతా పరుగెత్తుకుంటూ వచ్చి విషయం విచారిస్తే ఏదో ఒక ఆకారం గాలిలో తేలుతున్నట్లుగా వచ్చి 'ఈ రూం నాది నీవు లే అంటూ బెదిరించాడు. అంటూ ఆయాసంతో చెమటలు పోస్తూ వచ్చే ప్రాణం పోయే ప్రాణంగా మారిపోయాడు. అంటూ చెబుతూ వుంటే డాక్టరు వేణుగోపాల్ వాళ్లను మధ్యలో ఆపి 'మరి గంగారాం ఏమయ్యాడు?' అంటూ ప్రశ్నించాడు.

ఆ! వినండి - అదే రాత్రి తెలతెలవారుతుండగా అయిదవ గదిలో గంగారాం పరిస్థితి బాగా క్షీణించింది, అలసట, ఆయాసం ఎక్కువయ్యాయి. మాటపడి పోయినట్లుండి, అస్పష్టంగా ఏదో సైగ చేస్తున్నాడు. పరిస్థితి బాగా విషమించింది. భార్యాబిడ్డలను రప్పించారు. అయినా గంగారాం కళ్లు ఎవరికోసమో వెదుకుతున్నాయి.

ఇంతలోకే రూం నెంబరు మూడులో డ్యూటీ ముగించుకుని షీనీ కూడా అయిదవ నంబరు గదికి వచ్చింది. గంగారాం పరిస్థితి చూస్తూ 'పాపం ఈ పేషెంట్‌ను రూం నంబరు '(థి' కి మారిస్తే బాగుండును' అంది.

అయితే అక్కడున్న పేషెంటేమైపోతాడు ? అన్న ప్రశ్నకు సమాధానంగా, ' ఆయనను ఇంటెన్సియూ కేర్ యూనిట్‌కి మార్చారు' అంటుండగానే గంగారాం నాడి పడిపోవటం ప్రారంభించింది. బంధువులందరినీ అవతలికి పొమ్మన్నారు. నిమిషాల మీద ప్రాణాలను నిలువరించే సాధనాలన్నీ తెచ్చి గంగారాంను అనేక కనెక్షన్లకు కూడలి పట్టైన వో స్తంభంగా మార్చారు. గంగారాంకు వుపచారం చేయడానికి షీనీ నియోగింపబడింది.

అన్ని ఆశలు వదులుకుని చివరి ప్రయత్నం చేస్తున్న డాక్టర్లకు ఆశ్చర్యాన్ని కలిగిస్తూ గంగారాం కళ్లు తెరిచి వో మారు చూట్టురా చూచాడు. పక్కలో తనకు ఇంజెక్షన్ చేస్తూ షీనీ కనిపించింది. గోలుపోయిన చైతన్యం తిరిగి వచ్చినట్లు గంగారాం కళ్లల్లో కాంతులు మెరిశాయి. ఆశలు చిగిరించిన తృప్తి కనిపించింది.

వృత్తి ధర్మంగా ప్రయత్నిస్తున్న డాక్టర్లూ, మెడికల్ ఎక్స్‌పర్ట్సు అందరూ మరిచిపోయిన దైవీ శక్తిని గుర్తు చేసుకుంటూ నమ్మకాన్ని బలపర్చుకున్నారు. ఇది మళ్లా పునర్జన్మే అన్నారు. నిజానికి ఆ జన్మనిచ్చింది షీనీ దర్శనం, ఆ గాలి, ఆ వాసన, ఆ స్పర్శ అంటూ నిర్ధారించుకోవచ్చు.

అంతటి వెలుగు చూపిన గంగారాం కళ్ళు వో క్షణకాలంలో శాశ్వతంగా మూతపడ్డాయి. పరీక్షించిన డాక్టర్లు 'గంగారాం యికలేడ'ంటూ స్టర్టిపై చేసి చెమటలు తుడ్చుకున్నారు. షినీ నిర్లిప్తంగా తన డ్యూటీకి వెళ్లిపోయింది. బంధువులతో కూడా గంగారాం శవమై యిల్లు చేరాడు.

'అయితే రూం నెంబరు త్రీ గది హాంటెడ్ అంటూ ఎట్లా తెలిసింది'? డాక్టరు ప్రశ్న.

' ఆ మరునాడు వో పల్లెటూరి స్త్రీ సీరియస్‌గా వుందని ఈ గది కేటాయించారు. అమె కూడా ఆ రాత్రి పెద్దగా అరుస్తూ ఈ గదిలో దయ్యం వుంది అంటూ నానా హంగామా చేసింది. గది మార్చారు.

ఆ తరువాత ఈ గదిని మరో పేషెంటుకు ఇచ్చారు. ఆయనకు ఏ ఆకృతి కనిపించలేదు కానీ, 'నేను గంగారాంను, ఈ గది నాది, ఇందులో ఎవరు ప్రవేశించినా చంపేస్తాను' అంటూ ఏదో స్వరం వికృతంగా వినిపించింది. బాబూ ఇందులో దయ్యం వుంది. నాకు వద్దంటూ గోల చేశాడు. ఆ నాటినుంచి ఈ రూంలో దయ్యం వుందని గట్టినమ్మకం ఏర్పడింది' అంటూ అందరు ఏక కంఠంతో ముగించారు.

ఇందులో ఏదో రహస్యం దాగివున్నట్లు డా. వేణుగోపాల్‌కు స్ఫురించింది. అంతేకాదు, కారణం ఏదో కానీ? ఆ నర్సింగ్‌హోంలో వున్న డాక్టర్లకూ,స్టాఫ్‌కు కూడా సంబంధం వుంది. వుంటుందని ఆయనకు లీలగా తోచింది. అయినా ప్రధాన సూత్రం అంత తేలికగా అంతు చిక్కలేదు. మానేజ్‌మెంట్ మీద కసితో, ఈర్ష్యతో ఎవరైనా పుకారు పుట్టించారా? అంటే? దానికి తగిన క్లూస్ ఈ కథలో కనిపించలేదు.

'మనం ఎవ్వరికి వాళ్లం నైట్ డ్యూటీ రోజు రెస్ట్ రూంగా ఎందుకు వాడుకో కూడదూ? అంటూ తోటి డాక్టర్లను సంప్రదించాడు. దానికి వెంటనే స్పందిస్తూ వో డాక్టరు 'ఆర్ యూ క్రేజీ? వైషుడ్ వి బై అన్‌నెసిసరీ హెడేక్? అంటూ వారించే ప్రయత్నం చేశాడు. ఆయన ముఖంలో మాటల్లో ఏదో ఆత్రం. ఆందోళనా కన్పించింది.

ఇంతలో డాక్టర్ మురళి అందుకుని 'డాక్టర్! ప్రేతాత్మలూ, దయ్యాలను నేను నమ్మను కానీ నేను కొంచెం భయస్థుడ్ని. ఈ గంగారాంనే తల్చుకుంటూ వూహించుకుని నిజంగానే ఏదో అస్పష్టంగా నడుస్తున్న ఆకృతిని చూడవచ్చు. సైకలాజికలీ ఐయాం టూ సెన్సీటివ్. నేను పనికి రాను' అన్నాడు.

ఇంతలోకే వో సిస్టరు చొరవ తీసుకుని 'డాక్టరు మీరే ఓ రాత్రి ఆ పనికి శ్రీకారం ఎందుకు చుట్టకూడదూ?' అంటూ నాలికె కర్చుకుంది.

ఈ సందర్భంలో అందరి ముఖకవళికలూ వారివారి బిహేవియర్ ప్యాటర్న్సి అన్నీ గమనించాడు. డాక్టర్ వేణుగోపాల్. ఇంటికి వెళ్లి బాగా ఆలోచించాడు. వో పథకాన్ని రూపొందించుకున్నాడు.

తెల్లవారి మామూలుగా డ్యూటిలో ప్రవేశించాడు వేణుగోపాల్. అందరూ నాలుగు గంటలకు టీ తాగుతున్నారు. 'బాలూ' వార్డుబాయ్ వచ్చి 'సర్! ఈ రాత్రి డ్యూటీ ఏ డాక్టర్ కుండది సార్? టీ ఎప్పుడు తేవాలి?' అన్నాడు. అతను అందరితో ఎంతో చనువుగా మాట్లాడ్తాడు. చెప్పిందే తడవుగా పనులు సాధించుకొస్తాడు. ఈ బాలూ గొంతు కొంత బొంగురుగా ధ్వనిస్తుంది. ఆ విషయాన్ని ఎందుకో డా. వేణు ప్రత్యేకంగా గమనించాడు.

ఇంతలోకే ఓ డాక్టరు డా॥ వేణుగోపాల్‌ను వుద్దేశిస్తూ 'బైదబై డాక్టర్ వేణుగోపాల్ ఈ రాత్రికి మీ యడ్వెంచర్ మాటేమిటి? మీరు రెడీయేనా? అన్నాడు.

'ఐ షల్ బ్రైఫర్ ద నైట్ యడ్వెంచర్, ఐ యామ్ రెడీ' అన్నాడు.

'బ్రేవో ! గుడ్ లక్' అంటూ అందరూ సరదాగా నవ్వారు.

ఎవ్వరూ లేనప్పుడు మూడో నంబరు గదిని బాగా పరిశీలించాడు. ఆ గదికి రెండు వైపులా ప్రవేశించడానికి వెళ్లడానికి సదుపాయంగా రెండు ద్వారాలున్నాయి. వెనుక తలుపు సాధారణంగా ఎవ్వరూ వాడని కారిడార్‌లోకి తెరుచుకుంటుంది. అయితే ఆ తలుపుకున్న బోల్టుకు ఓ తాడు బిగించబడి వుంది. లోపలి నుండి బోల్టు వేసుకున్నా అవతల కట్టిన తాడును లాగితే బోల్టు జారుతుంది, లోనికి ప్రవేశించవచ్చు.

ఈ అమరిక వింతగా కనిపించడమే కాకుండా ఏదో కర్లా చిక్కనట్లు అనిపించింది. తరువాత రూంలో ప్రవేశించి జాగ్రత్తగా సైడ్ బోర్డుతో సహా వెదికాడు, రూమంతా నీటుగా వుంది. కానీ బాత్ రూం నల్లాపై ఓ చేతి రుమాలు కనిపించింది. అది తీసి చూస్తే ఓ ప్రత్యేకమైన మైల్డ్ సెంటు వాసన వచ్చింది. ఇదే వాసన తాము టీ తాగేప్పుడు డా॥ జేమ్సు పెదాలు తుడ్చుకుంటున్నప్పుడు కూడా వచ్చింది.

ఈ విషయాన్ని అంతగా పట్టించుకోకపోయినా దీన్ని కూడా నోట్ చేసుకుంటే మంచిదంటూ మనసులో పెట్టుకున్నాడు. ఇంతకన్నా విశేషాలేవీ చిక్కలేదు. ఇకపోతే మిగిలింది మూడో నంబరు గది ఆయా, ఆమెను గూర్చి తెలుసుకోవాలి.

వివరాలు కనుక్కుంటే ఆమె పేరు ఎల్లమ్మ. వయస్సు దాదాపు నలభై పై బడి వుంటుంది. షీ ఈజ్ ఎఫిషియంట్, బట్ గ్రీడీ, వున్నవీ లేనివి కల్పించి చెప్పడంలో దిట్ట, డబ్బుకు ఏ పనైనా ఎంత పనైనా చేస్తుంది. డ్యూటీలో మాత్రం రెగ్యులర్, అందరు ' ఎల్లూ ' అంటారు. ఈ నర్సింగ్ హోం అంతటికి వార్డుబాయ్ బాలూ, ఆయా ఎల్లూ లేకుంటే ఏ పనీసాగదు. అంటూ హెడ్ సిస్టర్ లలితామేరీ చెప్పింది. విషయం అంతా శ్రద్ధతో విన్నాడు.

ఆనాడు సమయం చాలా వేగంగా నడిచింది. రాత్రి డ్యూటీలో వున్న డాక్టర్లంతా గదుల్లో పేషెంట్స్‌ను చూచి విశ్రాంతి గదిలోకి చేరుకున్నారు. ఆనాడెందుకో పగటి డ్యూటీ ముగించుకున్న బాలు ఇంటికి వెళ్లకుండా కనిపించాడు. మాట ప్రకారం వేణు రూం నెంబరు త్రీలో ప్రవేశించి ఈజీ చేర్‌లో నడుం వాల్చి ఏదో మెడికల్ జర్నల్ చదువుకుంటున్నాడు.

ఇంతలోకే 'డాక్టరయ్యా ! నేను ఎల్లును అన్నది. వెతకబోయిన తీగ ఎదురొచ్చి అంటూ డాక్టరు వేణు 'రా ఎల్లూ రా! ఏమిటి విశేషాలు?' అంటూ లేని ఆప్యాయతను వలకబోస్తూ పిలిచాడు.

ఎల్లమ్మ పిలిచిందే పదివేలంటూ కొంగు సవరించుకుంటూ వచ్చి వో గంటో గంటున్నరో వుండే మనిషిలా కుర్చీ పక్క వెంబడి కింద కూర్చుంది. చదువుతున్న మ్యాగజీన్ మూస్తూ ఏదైన ప్రత్యేకమైన విషయమా? అంటూ ప్రశ్నించాడు.

ఆ ప్రశ్నతో ఎల్లమ్మ కొంత శక్తిని పుంజుకుంటూ ' ఏం లేదు దొర! నీవు జూస్తె వయసు పాయానవుండవు. ఆ డాక్టరు బాబులకు నీమీద ఏం ప్రేమ? ఈ యాళ్ల రాత్రి ఇందుట్ల వొక్కడవు పండుకుంటుండవంట అని నాకు శీలమ్మ జెప్పింది. షీని సిస్టరు ఇట్లగాదు, తన పనేందో తను, అటెంక ఎవరు ఎట్ల బోయినా పట్టించుకోదు. ఈ మూడో నెంబరు సిస్టరు ఆ తల్లే, ఆ తల్లి జేయవట్టే ఆ గంగారాం సచ్చిగూడ ఈ రూంలనే తిర్గుతడు.

ఈ రూం గంగారందంట, ఏ పేషెంటు వొచ్చిన గని తొల్త సంపుత పో అంట బెదిరిస్తడు, అటెంక నల్లటి బుర్క గప్పు కొచ్చి గొంతు పిస్కి సంపుతడు, అంటుంటె.

'డా॥ వేణు' అయితే ఎల్లూ ఏ పేషెంటన్నా అలా చచ్చాడా?' అంటూ ప్రశ్నించాడు.

'కాదా! మళ్ల? ఇందుట్ల కొచ్చిన కేశవయ్యను గొంతు పిస్కుత అంట దగ్గరికి వొస్తెనె గద? బెదుర్కొని సచ్చిండు?'

'మరి పల్లెటూరి నుండి వచ్చిన జానమ్మ ఎలా వెళ్లింది?' అన్న ప్రశ్నకు -

'అయ్యో! డాక్టరయ్యా! డా॥ జేముసయ్య పుణ్యం గట్టుకోబట్టిగని ఆ జానమ్మ ఆ రాత్రే గుటుక్కుమనేది.'

'అంటే? ఎలా రక్షించాడేమిటి?' అన్నాడు వేణు.

'పాపం! ఏసయ్యను నమ్ముకున్న మనిషి ఆయిన, నా చేతులో పది రూపాయలనోటు వెట్టి పాపం పల్లెటూరి మనిషి, భయపడిపోతుంది, ఈ గంగారాం విషయం అంతా మొదటే చెప్పి ధైర్యంగ నీవు ఆడ్నే పండుకో, ఏదన్న నీడ కనిపిస్తే చాలు పెద్దగ లొల్లి పెడ్తె అందరొస్తురు' అంట సలా జెప్పిండు ఆ దొర.

వుప్పు దిన్నంక, యిమానం వుండొద్దా? అందుకని పొద్దున జానమ్మ వొచ్చినప్పటినుంచి ఆమె చెవుల ఇల్లు గట్టుక గంగారాం దయ్యెం ముచ్చెటే జెప్పి బుగులు వట్టకు గని ఈ అరలకెల్లి ఇంగో అరలకు పో' అంట జెప్పిన - నా మాట ఇని, సీకటి గాకముందే వణుక వట్టింది. ఆ రాత్రి వాళ్ల సెల్లెగుడ ఇందుట్లనే వుండింది. వాళ్ల సెల్ల జెర గట్టి మనిషి.

'ఆ!' దవాఖాన్ల దయ్యాలెక్కడివి. ఏందో కత? వూకో' అంట సముదాయించి పండుకున్నరు. వో సెరిసగం రాత్రి గంగారాం జీవి వొచ్చి 'ఇది నా రూం, ఇడ్సిపో' అన్నడంట. ఆ మాటలిన్న అక్క చెల్లెండ్లిద్దరు లొల్లి లొల్లి వెట్టి తెల్లారి ఆరూం ఖాలి జేసిన్రు. నీవు కొత్త డాక్టరువు అందికే నీకు జెప్తుండ నీవునాకు వో పావులో పర్కా ఇస్తవు గద అన్నది'.

అదంతా విని డా॥ వేణు నిజంగా భయపడ్డట్లు నటిస్తూ 'ఏల్లా! నీవెంత మంచిదానవు. ఇదో ఈ పది వుంచుకో! నీవూ నా గది దగ్గరే పడుకో, గంగారాం భూతం రాగానే అరుస్తాను, ఇక ఇప్పటికి వెళ్లు' అన్నాడు.

ఈ గది చుట్టున్న మంచు దానంతట అదే విడిపోవడం ప్రారంభమైంది. ఈ మిస్టరీ అంతటికీ సూత్రధారులు సిస్టరు శీలా, డా॥ జేమ్సులా కనిపించారు. కానీ ఎందుకూ? ఎలా? అర్థం కాలేదు.

బెడ్‌లైట్ వేసుకున్నాడు, ట్యూబ్‌లైట్ ఆఫ్ చేశాడు. తలుపు బోల్టు వేశాడు. బెడ్‌పైన పడుకొని నిద్రిస్తున్నట్లు నటిస్తున్నాడే కాని, నిద్రపోలేదు, సమయం ఒకటి దాటింది, రెండు కావస్తుంది. అంతవరకు నిశ్శబ్దంగా వున్న గదిలో కిటికీ తలుపులు ఏదో ధ్వనిస్తున్నట్లనిపించింది. ఇంతలోకే ఠపీల్‌మంటూ బోల్టు పడి వెనకవైపు తలుపు కిర్రుమంటూ తెరుచుకుంది, ఆ తరువాత ఆపాదమస్తకం నల్లటి ముసుగు చాలా లూజ్‌గా ధరించి భూమి మీద తేలుతున్నట్లు రెండు చేతులు రెక్కల్లా వూపుతూ వో భూతం ప్రవేశిస్తూ 'నేను గంగారాంను ఇది నా రూం. దీన్ని వదలు, లేదా రేపు నిన్ను చంపేస్తాను' అన్నది. తొలిసారి చూడగానే ఆ ఆకృతి జిల్లుమంటూ వెన్నెముకను కదిలించింది. ఆ భూతం వెనుదిరిగి రెండోమారు ఆ మాటలే రిపీట్ చేసింది.

వెంటనే డా॥ వేణుకు ఆ ధ్వని బొంగురుతనం ఎక్కడో విన్నట్లనిపించింది, రెండోసారి స్ఫురణకు వచ్చినట్లు 'బాలూ! ఇలా రా అంటూ గబుక్కున వెళ్లి పట్టుకున్నాడు. ఆ దయ్యం కొయ్యబారి గత్యంతరం లేక కాళ్లపై పడ్డది. దయ్యెం ముసుగులో వున్నది బాలూ. బాలు కథంతా చెప్పాడు.

డా॥ జేమ్సు, సిస్టరు శీల మధ్యలో ప్రేమ కథ నడుస్తూ వుంది. వాళ్లకు ఈ రూం అనుకూలంగా వుంది కానీ ఎప్పుడో కాని ఖాళీగా వుండదు. అందుకోసం నన్ను ఆసరగా సుకున్నారు. నా నోట్ల మన్ను బోయకండి సర్! బతికినంత కాలం మీకు సేవజేస్త. ఈ కప్పుల పెట్టుకోండి' అంట ఏడ్చిండు. కాళ్లు కన్నీళ్లతో కడిగాడు.

తెల్లవారింది. వేణు ఏ వికారం లేకండా ఎప్పటిలానే వున్నాడు. డాక్టర్లు రాగానే డాక్టర్! దయ్యం ఏమైంది? కనిపించిందా? చూశారా? అంటూ ఎన్నెన్నో ప్రశ్నలు గుప్పించారు. అన్నిటికి సమాధానంగా వేణు చిరునవ్వు నవ్వుతూ మెల్లిగా దయ్యెం చచ్చిపోయింది. చంపేశాను' అన్నాడు.

అందరూ ఒక్క పెట్టున 'హాఁ' అన్నారు. డా॥ జేమ్సు అదెలా? అంటూ ఆత్రపడ్డాడు. 'ఇదో ఆ దయ్యం చర్మం' అంటూ ఆ నల్లటి బురఖాను చూపించాడు. అది చూడగానే జేమ్స్, 'నో, నో' అంటూ టేబుల్‌పై పడిపోయాడు.

శీలా వచ్చింది. కళ్లు కిందకు దించుకుని సిగ్గుతో క్రుంగిపోతూ 'సర్! ఐయాం గిల్టీ, నా వృత్తికి నేను ద్రోహం చేశాను. సెల్ఫిష్‌గా ఆలోచించి, డా॥ జేమ్సును పెళ్లి చేసుకోవాలి అన్న కాంక్షతో ఈ రూం ఖాళీగా వుంటే బాగుంటుందనుకున్నాం. పార్డన్ మి సర్, నాకూ జేమ్సుకు పెద్ద శిక్షపడుతుంది. అంటూ కళ్ల నీళ్లు పెట్టుకుంది.

ఇంతలోకే షీని వచ్చింది. 'ప్లీజ సర్! వీళ్లను ఎక్స్‌క్యూజ్ చెయ్యండి' అంటూ తన ధోరణిలో రిక్వెస్టు చేసింది. ఇంతలోకే వేరే డాక్టరు అందుకుని మరి మొదటి పేషెంట్ ఎలా చచ్చిపోయాడు? కారణం? అన్నాడు.

వేణు నవ్వుతూ చిలిపిగా 'షీనీ' అన్నాడు. 'వాట్?' అంటూ షీనీ కళ్లు పెద్దవిగా చేసి చూసింది. అందరు ప్రశ్నార్థకంగా డా॥ వేణును చూశారు.

' అఁ ఏమీలేదు. గంగారాంకు షీనీ ఓ దేవతలా కనిపించింది. తనపై ఆప్యాయతను గుమ్మరించింది. తనలో శక్తిని ప్రోది చేసింది. మరి? ఆ షీని రూం నంబరు త్రీ కే పరిమితం. షీని సేవలు లేని రూం తనకు నచ్చలేదు. నిజానికి ఆ రాత్రి వెళ్లి భయపెట్టింది గంగారామే, కానీ బలహీనంగా నడవలేని స్థితిలో ఈడ్చుకుంటూ మెల్లిగా నడుస్తున్న కారణంతో చీకట్లో అతడో పేషెంట్ అనుకోకుండా దయ్యమో, భూతమో అనుకుని భయపడ్డాడు. హార్ట్ పేషెంట్ షాక్‌తో మరణించాడు. అంతే'.

'మరి గంగారాంకు ఎలా వికటించింది?'

' ఆపరేషన్ జరిగి లేవలేని స్థితిలో వున్న గంగారాం, షీనీ మీద వున్న వ్యామోహంతో బలాన్నంతా కూడ గట్టుకుని ఎవరు చూడకుండా రూం నంబరు త్రీకి వెళ్లి ఆ పేషెంటును బెదిరించాడు. కానీ తరువాత జరగవలసిన పని జరిగిపోయింది. ఈ విషయం షీనీకి తెలుసు 'యాం ఐ రైట్?' అన్నాడు.

'ఎస్ సర్! యూ ఆర్ జీనియస్' అన్నది షీనీ అందరూ 'మీరు గొప్ప మానసిక శాస్త్రవేత్తలండి!' అంటూ పొగిడారు.

మళ్లా అందరు ఏకకంఠంగా 'ఈ మిస్టరీ హాపీగా విడిపోయింది. ఈ కథను కూడా గుట్టుగా హాపీగా ముగిద్దాం. క్షమింపదగని నేరమైనా ఈ సారికి క్షమించండి. అందరికీ తెలిస్తే ఈ నర్సింగ్ హోం మరింత ఆభాస పాలౌతుంది' అంటూ కోరస్ పాడారు.

ఇద్దరు ముగ్గురు పెద్ద డాక్టర్లతో కలిసి వేణుగోపాల్ మానేజ్‌మెంటు వారి వద్దకు వెళ్లి, 'మంచి రూం నెంబర్ త్రీ వేకంట్‌గా వుంటూంది, దీనివల్ల పేషెంట్సూ, మేనేజ్‌మెంటూ ఇద్దరూ నష్టపోతున్నారు. అనవసరంగా భయం ప్రబలింది తప్ప మరేమీ లేదు, ఏదో భూత వైద్యుడొచ్చి తంతు జరిపినట్లు చేసి భూతాన్ని వెళ్లగొట్టాం అంటూ ప్రచారం చేద్దాం, అంతలో

మా డాక్టర్స్ అందరం తలా ఒకరోజు ఒక్కొక్కరమే పడుకుంటూ, తరువాత నా హామీతో నా పేషెంట్‌నే ఈ గదిలో వుంచుతాను. ఆతరువాత కథ మామూలుగా మారుతుంది అన్నాడు. వేణు.

ఈ సలహాకు మేనేజ్‌మెంటు ఎంతో ఆనందిస్తూ ఈ డాక్టర్ల బృందాన్ని ఎంతో పొగిడారు. అన్నమాట ప్రకారం కార్యక్రమం జరిగింది. జేమ్సు శీలా కన్నీళ్లతో వేణు కాళ్ల కడిగి దంపతులయ్యారు. నవదంతులకు ఆ రూం ఒక రాత్రి ఆశ్రయాన్ని పంచింది. మళ్లా మేమంటే మేం, మాకంటే మాకంటూ రూం నంబరు థ్రి కోసం ఎగబడ్డారు. అవును రూం నంబర్ థ్రి అంటేనే థ్రిల్.

షీనీ డాక్టర్ వేణుకు థ్రీ చియర్స్ చెప్పింది.